క్లుప్తంగా

మార్మోగిన హరినామస్మరణ



ప్రత్యేక అలంకరణలో శ్రీ రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో హరే కృష్ణ, హరే రామ నామస్మరణ ఆదివారం మార్మోగింది. వారాంతపు పూజలు సందర్భంగా ఇస్కాన్ అధ్యక్షులు సాంబాదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని భగవద్గీత శ్లోకాలు, పలు ప్రవచనాలు ఆలపించారు. ఈ నేపథ్యంలో రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

ఘనంగా అవతార్ మెహర్ బాబా కేంద్ర వార్షికోత్సవం



రేవిడిలోని అవతార్ మెహర్ బాబా కేంద్రంలో సంకీర్తనలు ఆలపిస్తున్న భక్తులు

పద్మనాభం: మండలంలోని రేవిడి జంక్షన్‌లో ఉన్న అవతార్ మెహర్ బాబా కేంద్రం 17వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఉదయం అవతార్ మెహర్ బాబా చిత్రపటాన్ని రేవిడి వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు సంకీర్తనలు ఆలపించారు. అవతార్ మెహర్ బాబా 20 కేంద్రాల నుంచి తరలివచ్చిన భక్తులు బాబాను దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో రిటైర్డు ఎంపీడీవో బాపిరాజు, రేవిడి హైస్కూల్ హెచ్‌ఎం వి.శంకరరావు పాల్గొన్నారు.

ఆర్‌వో ప్లాంటు ప్రారంభం



భద్రయ్యపేటలో ఆర్‌వో ప్లాంటు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

పద్మనాభం: మండలంలోని రెడ్డిపల్లి పంచాయతీ భద్రయ్యపేటలో రోటరీ వైజాగ్ క్లబ్ కపుల్స్ నిధులు రూ.6 లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్‌వో ప్లాంటును ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్లాంటును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రోటరీ వైజాగ్ క్లబ్ డీజీఎం శోభన్ మాట్లాడుతూ ఆర్‌వో ప్లాంటు ద్వారా గంటకు 500 లీటర్ల నీరు సరఫరా అవుతుందన్నారు. ప్లాంటును సక్రమంగా నడుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రోటరీ వైజాగ్ క్లబ్ అధ్యక్షుడు రాంప్రసాద్, ఎంపీడీవో ఎం.విజయ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె.దామోదరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కె.రమణ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శ్రీకృష్ణలీలా గానం

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం శ్రీకృష్ణ అర్పణం కార్యక్రమం సాయంత్రం 6 గంటల నుంచి జరిగింది. శ్రీరాధా మదన్ మోహన మందిరంలో చిన్నారులు దీపిక, శ్రావణి, వైష్ణవి, చరణ్, శ్రీరామ్ తదితరులు శ్రీకృష్ణలీలలను అద్భుతంగా గానం చేశారు. ఈ సందర్భంగా హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు నిష్కించన భక్తదాస మాట్లాడుతూ కళాకారులు సంగీతం, నృత్యం లేదా సాంప్రదాయ కళారూపాలను సమర్పణగా అందించడానికి వేదికగా ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఆదివారం నిర్వహించే ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలనుకునే కళాకారులు 95425 11108 నంబరులో సంప్రదించాలని అంబరీష దాస కోరారు.

సర్వీస్ రోడ్డు మురుగుమయం



సర్వీస్ రోడ్డుపైకి ఉబికి వస్తున్న మురుగునీరు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు సబ్బివానిపేట డ్రైనేజీల నుంచి ఆదివారం మురుగునీరు పొంగి సర్వీస్ రోడ్డుపైకి ప్రవహించింది. దీంతో ఈ రహదారి పొడవునా చికెన్, మద్యం దుకాణాలు, హోటళ్ల ముందు నుంచి మురుగునీరు ప్రవహిస్తుండటంతో వినియోగదారులు ఇబ్బంది పడ్డారు. అనిట్స్ కళాశాల రహదారి నుంచి టీచర్స్ కాలనీ వరకు డ్రైనేజీలు మట్టితో పూడుకుపోవడంతోనే తరచూ డ్రైనేజీల నుంచి మురుగునీరు రహదారి మీదకు వస్తుందని, డ్రైనేజీలను తెరచి శుభ్రం చేయాలని సబ్బివానిపేట వాసులు కోరుతున్నారు.



గతుకులతో.. బితుకు బితుకు

- హౌసింగ్ బోర్డ్ కాలనీలో గోతులతో నిండిన అంతర్గత రహదారులు
- పాదచారుల ఇక్కట్లు
- బురదమయంగా మారిన పోస్టాఫీస్ రోడ్డు
- గతుకులను పూడ్చని జీవీఎంసీ
- రోడ్డు మధ్యలో కుంగిపోతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ

పీఎం పాలెం: స్థానిక రత్నగిరి హౌసింగ్ బోర్డ్ కాలనీలో గల అంతర్ రహదారులకు దశాబ్దాల తరబడి కనీస నిర్వహణ చేట్టకపోవడంతో అధ్వానంగా తయారయ్యాయి. ముఖ్యంగా క్రికెట్ స్టేడియం పరిసర ప్రాంతాల్లో మరీ దారుణంగా ఉన్నాయి. చిన్నపాటి వర్షం కురిసినా పాదచారులు అడుగు తీసి అడుగేయలేని విధంగా గతుకులతో నిండిపోయాయి. కారుషెడ్ కూడలి నుంచి హౌసింగ్ బోర్డు కాలనీకి వెళ్లే రోడ్డు కనీస అభివృద్ధికి నోచుకోలేదు. ఏళ్ల తరబడి కచ్చా రోడ్డుగానే దర్శనమిస్తోంది. రోడ్డు పొడవునా గతుకలే గతుకలు. చినుకు పడితే పాదచారులు ఆ దారిలో ప్రయాణించడానికి వీలు కాని పరిస్థితి. ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. కారుషెడ్ కూడలికి చేరుకోవడానికి ఇది దగ్గర దారి కావడంతో దీన్ని అభివృద్ధి చేయాలని పలుమార్లు అధికారులు, పాలకులకు మొర పెట్టుకున్నా కనీస స్పందన లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గుంతలతో ఇక్కట్లు..

కాలనీలోని పోస్టాఫీస్ ఎదురుగా ఉన్న రోడ్డులో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. మరమ్మతుల్లో భాగంగా కంకర మట్టితో రోడ్డును నింపేశారు. గతంలో గుంతలు ఉన్నా ఏదోలా అవస్థలు పడుతూ రాకపోకలు సాగించేవారు. ప్రస్తుతం వర్షాలు పడుతుండటంతో రోడ్డు బురదమయంగా మారింది. రోడ్డులో గత కొద్ది రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. అటు ఇటు తారు- సిమెంట్ రోడ్లు ఉండగా గతుకులమయంగా ఉన్న రోడ్డు ఎత్తు పెంచడానికి కంకర మట్టితో లేయర్ వేయడంతో అది బురదమయంగా మారి వాహనాలు, పాదచారుల రాకపోకలకు విఘాతం కలిగిస్తోంది. వేసవి కాలంలో రోడ్డు మరమ్మతులు చేపట్టి ఉంటే ఇప్పుడీ దుస్థితి వచ్చేది కాదని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. పరిస్థితి మరింత దిగజారడం వల్ల ఆ రోడ్డులో ప్రయాణించాల్సిన వారు చుట్టూ తిరిగి వెళ్తున్నారు. వెంటనే రహదారికి మరమ్మతు చేయాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే కాలనీలో పలు చోట్ల గతంలో నిర్మించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పలు చోట్ల కుంగిపోయింది. ఈ కారణంగా ఆయా రహదారుల్లో ప్రయాణించే వారు ఇబ్బంది పడుతున్నారు.



కారుషెడ్ కూడలి నుంచి హౌసింగ్ బోర్డ్ కాలనీకి వెళ్లే రోడ్డు దుస్థితి



కాలనీలోని గతుకుల రోడ్డులో పాదచారుల అవస్థలు



అండర్ గ్రౌండ్ డ్రెయిన్ మ్యాన్‌హోల్ వద్ద కుంగిపోయిన రోడ్డు

స్థానిక నేతలు స్పందించాలి



అధికారం చేపట్టిన వెంటనే రోడ్ల పరిస్థితి చక్కదిద్దుతామని గొప్పలకు పోయిన కూటమి ప్రభుత్వం ఏడాది గడిచినా ఈ ప్రాంతంలోని రోడ్లు పునరుద్ధరించకపోవడం విచారకరం. స్థానిక నాయకులు స్పందించి ఈ ప్రాంతంలోని రహదారుల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలి. హౌసింగ్ బోర్డు కాలనీ, గాయత్రీనగర్, ఆర్‌హెచ్ కాలనీ తదితర ప్రాంతాల్లోని అంతర్ రహదారుల పునరుద్ధరణకు జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం తక్షణ చర్యలు తీసుకోవాలి.

–గాదె రోశిరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, పీఎం పాలెం

ఆరు తడి పద్ధతితో వరి పంటకు మేలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయం రీజనల్ అధికారి ప్రకాష్ తదితరులు

పద్మనాభం: ఆరు తడి పద్ధతితో వరి పంటకు మేలు చేకూరుతుందని ప్రకృతి వ్యవసాయం రీజినల్ అధికారి ప్రకాష్ అన్నారు. మండలంలోని మద్ది, పెంట గ్రామాల్లో రైతులకు ఆరు తడి పద్ధతిపై నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. ఆరు తడి పద్ధతి అవలింబిస్తే వరి పైరులో పిలకల శాతం పెరుగుతుందన్నారు. పంట అధిక దిగుబడి వస్తుందన్నారు. పంటకు తగినంత నీరు పెట్టుకోవచ్చాన్నారు. నీరు వృథా కాకుండా ఆదా చేసుకోవచ్చని సూచించారు. ఈ సందర్భంగా ఆరు తడి పద్ధతికి అవసరమయ్యే పరికరాలను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో డీపీఎం మోహనరావు, కొవ్వాడ ఎంపీటీసీ సభ్యురాలు బోని రమణమ్మ, ఎంఎంటీఎల్ గణేష్ కుమార్, డీఎంఎంటీలు బోని దుర్గారావు, పైడితల్లి, యూనిట్ ఇన్‌ఛార్జి అప్పలనాయుడు, కె.నగేష్ కుమార్ పాల్గొన్నారు.

300 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు గొల్లల ఎండాడలో గల ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. విశాఖపట్నం, ఎండాడ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విశాఖ ఐ ఆస్పత్రి సహకారంతో నిర్వహించిన శిబిరంలో 300 మందికి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు చెట్టిపిల్లి గోపి, నొడగల రాంబాబు, సాకరి శ్రీనివాస్, ఉప్పులూరి గోపి, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు తవ్వేయడంతో నిలిచిన రాకపోకలు



ఎండాడలో రోడ్డును తవ్వుతున్న దృశ్యం



రోడ్డును తవ్వేయడంతో నిలిచిపోయిన వాహనాలు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డులో రోడ్లు, కాలువల వంటి ప్రభుత్వ ఆస్తులను కొందరు ఇష్టారాజ్యంగా ధ్వంసం చేసేస్తున్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం అనుమతులు లేకుండా ధ్వంసం చేసేస్తున్నా ఎవరూ అడ్డుకోవడం లేదు. ఎండాడ రామాలయం వీధి జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద ఆదివారం ఓ బిల్డర్ తన నిర్మాణానికి అవసరమని పైప్ లైన్ ఏర్పాటుకు సీసీ రోడ్డును ధ్వంసం చేసేశాడు. దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆ మార్గంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆదివారం కావడంతో అధికారులు ఎవరూ అందుబాటులో ఉండరనే ఉద్దేశ్యంతో అనుమతులు లేకపోయినా మిషన్ సాయంతో రోడ్డును ధ్వంసం చేయడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వారిపై జీవీఎంసీ జోనల్ కమిషనర్ తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు.

30 నుంచి మరిడమ్మ తల్లి వారాల పండగ



సమావేశంలో సంఘ సభ్యులు

భీమునిపట్నం: భీమిలిలోని నాగవంశీయుల కుల దేవత మరిడమ్మ తల్లి వారాల పండగ నిర్వహణపై ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాగవంశ సంక్షేమ సంఘ అధ్యక్షుడు, ఆలయ ధర్మకర్త గాడు అప్పలనాయుడు మాట్లాడుతూ అమ్మవారికి ఈ నెల 30 నుంచి వారాల పండగ నిర్వహిస్తామని తెలిపారు. ఆ రోజు భక్తులు పసుపు, కుంకుమ సమర్పించడంతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించుకోవచ్చని తెలిపారు. పండగ నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. భీమిలి నాగవంశ సంక్షేమ సంఘ అధ్యక్షుడు కంటుభుక్త ముత్యాలరావు, నాయకులు గాడు సన్యాసినాయుడు, మొకర నర్సింగరావు, సంకురుబోతు జోగారావు, అప్పికొండ నూకరాజు, గాడు మురళి, కాళ్ల శివశంకర్ పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు రాట



చిప్పాడలో ఉత్సవ రాట కార్యక్రమంలో పాల్గొన్న సుత్తమ్మతల్లి భవానీ పీఠం సభ్యులు




ఉత్సవరాట వేస్తున్న శ్రీదుర్గా భవానీ ఆటో సంఘం సభ్యులు, భక్తులు

తగరపువలస: శ్రీదుర్గాభవానీ ఆటో సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ కూడలి వద్ద శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆదివారం రాట వేశారు. అర్చకుడు నేరెళ్ల విశ్వేశ్వరశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆటో సంఘం నాయకులు చిల్ల శివా రెడ్డి, చిల్ల ఎర్రయ్య రెడ్డి, చేట్ల శ్రీనివాస రెడ్డి, చిల్ల సూరి నరసయ్య రెడ్డి, చిల్ల కృష్ణా రెడ్డి, నీలాపు సూరిబాబు, శీరపు రామిరెడ్డి, రౌతు రాము, నీలాపు రామిరెడ్డి, గుజ్జు రాము తదితరులు పాల్గొన్నార.

- భీమిలి మండలం చిప్పాడలో 28వ శరన్నవరాత్రి ఉత్సవాలకు ఉత్సవరాటతో శ్రీసుత్తమ్మతల్లి భవానీ పీఠం ప్రతినిధులు ఆదివారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పూజా కార్యక్రమాల్లో చేపట్టబోయే అలంకరణలు, సాంస్కృతిక కార్యక్రమాలను తెలియజేశారు.

పారిశ్రామిక ప్రాంతంలో రాకపోకలకు అవస్థలు



వెల్లంకి పారిశ్రామిక ప్రాంతంలో ఒక పక్క భారీ వాహనాలు..., మరో పక్క గోతులు



బురదమయంగా వేములవలస, వెల్లంకి రహదారి

తగరపువలస: ఆనందపురం మండలం వెల్లంకి పంచాయతీలోని పారిశ్రామిక ప్రాంతంలో అడుగడుగునా గుంతలతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. సాధారణ రోజుల్లో వాయు, ధ్వని కాలుష్యంతో బాధపడేవారు వర్షాకాలంలో చెరువులను తలపించే రహదారులు, బురదమయం కావడంతో బోల్తా పడుతున్నారు. దీనికితోడు రోడ్డుపైనే భారీ వాహనాలు నిలిపివేయడంతో ఈ మార్గాలు నరకాన్ని తలపిస్తున్నాయి. వేములవలస నుంచి వెల్లంకి మీదుగా దొరతోట రోడ్డు, బొడ్డపాలెం, భీమిలి క్రాస్ రోడ్డు వరకు పంచాయతీలోని పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఈ గోతుల కారణంగా కష్టాలపాలవుతన్నారు. పాదచారులు, వాహనదారులు ప్రమాదాలకు గురి కావడం, కాలుష్యం బారిన పడడంతో అనారోగ్యానికి గురికావడం ఇక్కడ సర్వసాధారణమైపోయింది. ఇక చీకటి పడితే ఈ మార్గంలో ప్రయాణించడమంటే ప్రాణాలపై ఆశలు వదులకోవడమేనని పంచాయితీ వాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారులను అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.

డిమాండ్లు పరిష్కరించాలని రైతుల ఆందోళన



సూది కొండ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురంలో సూది కొండ వద్ద తమ సాగులో ఉన్న భూములను ఎంఎస్‌ఎంఈ పార్కు నిర్మాణానికి కేటాయించిన అధికారులు తమ డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఆదివారం ధర్నా చేశారు. తమ దగ్గర తీసుకున్న భూమికి మార్కెట్ రేట్ కన్నా రెండున్నర రెట్లు అధికంగా నష్ట పరిహారం, తమ సాగు భూమిలో ఉన్న మొక్కల తొలగింపునకు నష్ట పరిహారం ఇవ్వాలని రైతులు నినాదాలు చేశారు. సీపీఎం నాయకుడు అప్పలనాయుడు మాట్లాడుతూ రైతుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించడంలో రెవెన్యూ అధికారులు జాప్యం చేయడం తగదన్నారు. త్వరితగతిన రైతుల డిమాండ్లు పరిష్కరించాలన్నారు.

మద్యం మత్తులో వ్యక్తి హల్‌చల్



స్థానికుల సాయంతో దుస్తులు తొడిగిన పోలీసులు

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం పంచాయతీ బోయపాలెం గ్రామానికి చెందిన బాలకృష్ణ అనే వ్యక్తి ఆదివారం సాయంత్రం మద్యం మత్తులో గంటపాటు హల్‌చల్ చేశాడు. ముందుగా జాతీయ రహదారిని ఆనుకుని సంగివలస పార్కు వద్ద చెరువులో దూకడంతో ఆత్మహత్య చేసుకుంటున్నాడని భావించిన పార్కులో వ్యక్తులు రక్షించి ఒడ్డుకు చేర్చారు. తర్వాత దుస్తులు విప్పి డ్రాయర్‌తో కొంతసేపు పార్కులో ఉన్నవారిని భయభ్రాంతులకు గురి చేశాడు. తర్వాత డ్రాయర్ కూడా విప్పి పక్కనే ఉన్న సంగివలస కాలనీలోకి ప్రవేశించాడు. స్థానికుల సాయంతో పోలీసులు బాలకృష్ణకు బట్టలు తొడిగి వివరాలు రాబట్టే ప్రయత్నం చేశారు. మద్యం మత్తులో ఉండటంతో తనది బోయపాలెం అని కాపులుప్పాడ, ఎంవీపీ కాలనీ పేర్లు మార్చి చెపుతుండటంతో పోలీసులు తలలు పట్టుకున్నారు. తాము రజకులమని వృత్తి పనులు చేస్తుంటామని చెబుతూ కాపులుప్పాడలోని ఒకరి పేరు చెప్పడంతో తద్వారా పోలీసులు విచారించగా బోయపాలెంగా తేలింది. దీంతో సచివాలయ సిబ్బంది ద్వారా అతని భార్య పేరు జ్యోతిగా గుర్తించి సమాచారం అందించారు. భీమిలి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రభుత్వ మద్యం దుకాణాలలో విక్రయించే మద్యం సేవించడం ద్వారానే మతి తప్పి ప్రవర్తించినట్టు స్థానికులు తెలిపారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం



సంతపేట హైస్కూల్‌లో మహాలక్ష్మిని సన్మానిస్తున్న విద్యార్థులు



తాటితూరు హైస్కూల్లో ప్రసాదరావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

తగరపువలస: జాతీయ హిందీ భాషా దినోత్సవం ఆదివారం పలు హైస్కూళ్లలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హిందీ ఉపాధ్యాయులు జాతీయ భాష ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియజేశారు. సులభ పద్ధతిలో నేర్చుకుంటే కష్టమైన భాష కాదన్నారు. ప్రభుత్వ రంగ ఉద్యోగాల్లో హిందీ ఆవశ్యకతను తెలియజేశారు. భారత జాతీయోద్యమంలో అఖిల భారతాన్ని జాగృతం చేసి ఏకతాటిపై నడిపేందుకు హిందీ భాష ఆనాడు దోహదపడిందన్నారు. ఈ సందర్భంగా సంతపేట జీవీఎంసీ అంబేడ్కర్ హైస్కూల్‌లో హిందీ ఉపాధ్యాయురాలు మహాలక్ష్మిని సాయి సంహిత ఫౌండేషన్ అధ్యక్షురాలు ఎం.సంతోషికుమారి, ఉపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు ఘనంగా సత్కరించారు. భీమిలి మండలం తాటితూరు జెడ్పీ హైస్కూల్ హిందీ ఉపాధ్యాయుడు టీఎస్‌వీ ప్రసాదరావును ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.

ఉపాధ్యాయులకు అభినందనలు

తగరపువలస: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జరిగిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కార్యక్రమంలో జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు రామన్నపేట సాయిరవీంద్ర పాఠశాల ఉపాధ్యాయులకు అవార్డులు లభించాయి. నన్నయ విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ముర్రు ముత్యాలనాయుడు, అసోషియేషన్ రాష్ట్ర చీఫ్ మెంటార్ ఎ.కృష్ణారెడ్డి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. వీరిలో కరస్పాండెంట్ బోగెల కృష్ణ, ఉపాధ్యాయులు బండారు సౌజన్య, ఇందల ఇందుమతి, చిప్పాడ పార్వతిని ఆదివారం మిగిలిన ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.